విశాలాంధ్ర కృష్ణా జిల్లా

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయండి : లింగం ఫిలిప్

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : 26 మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల సమయంలో మచిలీపట్నంలోని సీపీఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్ అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి టీ తాతయ్య హాజరవుతారని సభ్యులందరూ సకాలంలో విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : లోకరక్షకుడు నేడు పుట్టెను.. అల్లె లూయ.. ఆమెన్ అంటూ పట్టణం లోని పలు చర్చిలలో బాలయేసు జన్మదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఆగమనాన్ని స్వాగతిస్తూ పలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గీతాలాపనలు చేశారు. ఆదివారం రాత్రి నుండే ఆర్‌సియం చర్చిలలో క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని మౌంట్ కార్మెల్ ఆర్‌సిఎం దేవాలయం, కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన్న తేరాజమ్మ ఆర్.సి.ఎం.-2 దేవాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ విశ్వాసులతో మతాలకు అతీతంగా వేలాది మంది ప్రజానీకం పాల్గొన్నారు. రాత్రి 11 గంటల సమయంలో స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్‌సిఎం చర్చిలలో ఫాదర్లు గుజ్జుల మైఖేల్, జాన్‌హరిష్‌లు, గుడ్‌మన్‌పేట చర్చిలో విచారగురువు ఎం.లూయిస్‌రాజు, చింత రాకేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో సందేశాన్ని అందించి క్రీస్తు జనన పశువుల కొట్టం(స్క్రిబ్) ప్రారంభించి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియం జోషి, సభ్యులు, బేజం సువర్ణరాజు, మెండా కిరణ్, అంతోని, క్రీస్తురాజు, భాస్కర్, వి.జీవరత్నం, విచారణపరిధిలోని సిస్టర్స్, ఉపదేశకులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆర్.టి.సి హైర్ బస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో దగ్గర ధర్నా నిర్వహించి కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్.టి.సి డిపో గేటు వద్ద హైర్ బస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో కృష్ణాజిల్లా ఏఐటీయూసీ నాయకులు ధర్నాకు సంఘీభావం తెలిపి అద్దాడ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్.టి.సి లో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్‌కు ఇ.ఎస్.ఐ ., ఇ.పి.ఎఫ్ కట్టాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఆర్.టి.సి లో డ్రైవర్స్ ఖాళీ పోస్టులలో హైర్ బస్ డ్రైవర్లను తీసుకోవాలని, ఈ నెల 30 వ తేదిన మచిలీపట్నంలోని ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటలకు కృష్ణాజిల్లా ఎ.ఐ.టి.యు.సి ఆధ్వర్యంలో జరిగే పోరాట భేరి కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాకు ఎం. నవీన్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి మట్టా మహేష్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని అన్ని డిపోలో ఉన్నటువంటి హైర్ బస్ డ్రైవర్లు ధర్నా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, పి. కోటేశ్వరరావు, వి. నాగార్జున, జి. దుర్గా ప్రసాద్, జి.నాగార్జునతో పాటు అవనిగడ్డ అయ్యప్ప వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచుతో వాహనదారులకు ఇబ్బందులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : నీటి మంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం వేకువ జామున నీటి మంచు విపరీతంగా దివిసీమలోని అన్ని గ్రామాలను కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోగా మరి కొంత మంది వాహనదారులు ఎక్కడ వాహనాలను అక్కడే నిలిపి వేసి ఉదయం 10 గంటల తరువాత వారి వారి గమ్య స్థానాలకు చేరుకున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ప్రయాణాలు చేయవలసిన వాహనదారులు వాహనాల లైట్‌లను ఉదయం 10 గంటల వరకు వేసుకుని జాగ్రత్తలు పాటిస్తూ, నెమ్మదిగా గమ్యస్థానాలకు చేరుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దివిసీమలో ముమ్మరంగా కోతలు కోసేందుకు కూలీలు బయలుదేరగా, రైతులు 11 గంటల వరకు కోతలను నీటి మంచు వలన నిలిపి వేసి మధ్యాహ్నం నుండి రెండవ పూటలో కోతలను కొనసాగించారు.

గ్రామాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర, కూచిపూడి : క్రిస్మస్ దినోత్సవం వేడుకలను గ్రామాలలో సోమవారం అట్టహాసంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని పలు క్రీస్తు దేవాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించుకొన్నారు. అదేవిధంగా ఏసుక్రీస్తు పుట్టుక తెలియపరిచే పశువుల పాకను, ఊయలలోబాల యేసును ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా కేకులు కోసి పంచడంతోపాటు చిన్నారులు యువత నాటికలను, వివిధ నృత్యాలను ప్రదర్శించారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు తర్వాత మత గురువులు క్రీస్తు జనన సందేశం ఇచ్చి ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు దేవాలయాలలో విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయిఈ సందర్భంగా క్రీస్తు దేవాలయాలకు భారీ సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు. మొవ్వ మండలంలోని 21 గ్రామాలలో గల వివిధ క్రీస్తు దేవాలయాలులో సోమవారం ప్రసంగాలు నిర్వహించారు. దీనిలో భాగంగానే మొవ్వ లైఫ్ గివర్స్ చర్చిలో కృష్ణా జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఫాదర్.వేమూరి పరిశుద్ధ రాజు, పెదపూడి బేతేలు చర్చిలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఫాదర్.అప్పిగట్ల ఇమ్మానియేలు ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర- గన్నవరం : రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు గన్నవరం కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు ఆదివారం పత్రికలకు తెలిపారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి. సుభాష్ కిరణ్,7వ తరగతి చదువుతున్న డి వెంకట్ లు జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నాగరాజు తెలిపారు. ఈ నెల 24,25తేదీలలో తెనాలిలో జరిగే జూనియర్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో కృష్ణా జిల్లా నుండి సుభాష్ వెంకట్ లు ప్రాతినిధ్యం వహిస్తారని నాగరాజు తెలిపారు. నైపుణ్యం చూపిన క్రీడాకారులను వీరిని ప్రోత్సహించిన నాగరాజు, ఆంజనేయులు లను గన్నవరం యం. పి. పి అనగాని రవి హాస్టల్ వార్డెన్ ప్రకాష్ అభినందించారు.

పోరాటభేరి జయప్రదం చేయండి : తాతయ్య

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : కృష్ణా జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 30న జరుగు పోరాటభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టీ. తాతయ్య అన్నారు. సోమవారం కామ్రేడ్ పిచ్చుక సోమేశ్వరరావు అధ్యక్షతన కప్పలదొడ్డి గ్రామంలో అరుణశ్రీ చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో జరిగిన పెడన నియోజవర్గ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలం కావడమే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని ఆంధ్రప్రదేశ్లో అధికారంలో ఉన్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఈ రెండు ప్రభుత్వాలను గద్దె దించే విధంగా 2024 ఎన్నికల్లో వామపక్షాల ఆధ్వర్యంలో ఏర్పాటును స్వాగతించాలని కోరారు. ఈనెల 30న ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరగబోయే పోరాటభేరిని విజయవంతం చేయాలని కోరారు. కృష్ణా జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గాలలో పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పేరశెట్టి ఉమాకాంతం, మండల కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, గూడూరు కార్యదర్శి పితాంబరం, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

విశాలాంధ్ర, కూచిపూడి : బాక్సింగ్ డే సందర్భంగా మంగళవారం ప్రారంభమయ్యే 'ఆడుదాం ఆంధ్ర 'పోటీలలో పాల్గొనటానికి మొవ్వ మండలంలోని 16 సచివాలయాలలో 211 టీమ్స్ తమ పేర్లు నమోదు చేయించుకున్నారని, మండల అభివృద్ధి అధికారి జి. సుధాప్రవీణ్ సోమవారం వెల్లడి చేశారు. ఈ టీమ్స్ లో 2004 మంది క్రీడాకారులు ఉండగా దానిలో పురుషులు 1290, మహిళలు 714 మందిని పేర్కొన్నారు. వీటిల్లో కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, ఖోఖో తదితర అంశాలు ఉన్నాయని వివరించారు. అలాగే ఈ పోటీలు నిర్వహణ కోసం ఏడుగురు పిడి/.పి.ఈ.టి.లు కొనసాగుతారని పేర్కొంటూ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాల యాల గ్రేడ్ 5 కార్యదర్శిలు వెల్ఫేర్ అండ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కాగా కూచిపూడి సచివాలయం పరిధిలో బ్యాట్మెంటన్ 9టీములు, క్రికెట్, వాలీబాల్, కాబట్టి నాకు రెండేసి టీములు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, ఈ పోటీలను శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళాపీఠం ప్రాంగణంలో నిర్వహిస్తామని వెల్ఫేర్ అండ్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు తెలిపారు.

సీఎం మనస్సు మార్చు యేసయ్య : అంగన్వాడీలు

విశాలాంధ్ర - బంటుమిల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి మనస్సును మార్చి మా న్యాయమైన కోర్కెలను తీర్చేటట్లు చూడు యేసయ్యా అంటూ బంటుమిల్లి ఐసిడియస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఏసుక్రీస్తునికి మొరపెట్టుకుంటూ ప్రార్థనలు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 14వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం బంటుమిల్లి ఐసిడిఎస్ కార్యలయం ముందు క్రిస్మస్ పండుగ సందర్భంగా అంగన్వాడి టీచర్లు ఆయాలు తమ న్యాయమైన కోర్కెలు తీరేటట్లు చూడాలని ఆ ప్రభువుకి ప్రార్థనలు చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కామ్రేడ్ పాల్ నాయుడు హాజరయ్యి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరంతా మీ ఫ్యామిలీతో హ్యాపీగా ఉండాల్సిన సమయంలో సీఎం జగన్మోహన్ రెడ్డి అనుచిత నిర్ణయాల వల్ల ఇక్కడ ఈ రూపంలో నిరసన చేయవలసి వచ్చిందని మీకు పోరాడే శక్తిని ఆ భగవంతుడు కలిగించాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజేటి శ్రీనివాసరావు ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు శ్రామిక మహిళ కన్వీనర్ పి ధనశ్రీ , లంకదాసు అజయ్ గోస్ ,బొడ్డు నాగరాజు ,మహిళా సంఘం నాయకురాలు ఎం పద్మ ,పెడన బంటుమిల్లి కృత్తివెన్ను ,అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు..

ఆగని అంగన్వాడీల నిరసన దీక్ష

విశాలాంధ్ర, కూచిపూడి : ఒకవైపు విస్తృతంగా కురుస్తున్న మంచుతో పాటు చలిగాలులను లెక్కచేయకుండా... మరొకవైపు గ్రామాలలో అట్టహాసంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలను సైతం జరుపుకోకుండా పట్టు సడలని అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది 14వ రోజు అయిన సోమవారం మొక్కవోని పట్టుదలతోతమ నిరసన దీక్ష కొనసాగించారు. మొవ్వ ఐ.సీడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలో అంగన్వాడి సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తూ నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారితోపాటు దీక్షలో పాల్గొన్న సీపీఎం నాయకులు మాట్లాడుతూ పేద పేద వర్గాలకు చెందిన అంగన్వాడి అక్కచెల్లెమ్మలకు

అధికారంలోకి వచ్చాక అండగా ఉంటానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాను ఆనాడుఇచ్చిన హామీలు మర్చిపోకుండా గుర్తు తెచ్చుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు విస్మరించితే రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తన అధికారాన్ని కోల్పోయే పరిస్థితి కొని తెచ్చుకొంటున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. క్రిస్మస్ వేడుకలు సందర్భంగా పట్టువదలని విక్రమార్కుని మాదిరిగా అంగన్వాడీ సిబ్బంది వేడుకలు జరుపుకోకుండా దీక్ష కొనసాగించడం ముదాహవమన్నారు. ఎంతో పవిత్రంగా భావించే ఈ పండగ రోజునైనా ముఖ్యమంత్రి వారి డిమాండ్లను అంగీకరించి చేయూతనివ్వాలని సూచించారు. సిపిఎం అనుబంధ సంస్థలైన కృష్ణాజిల్లా కల్లుగీత సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ కరిముల్లా అంగన్వాడి సిబ్బందితోపాటు సమ్మెలో పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ పర్వదినం

యేసుక్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలి. జడ్పీ చైర్ పర్సన్

విశాలాంధ్ర -పెడన: కరుణామయుడు, లోక రక్షకుడైన యేసుక్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించి నడుచుకోవాలని కృష్ణా జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. పట్టణంలో, మండల పరిధిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు చర్చిల్లో పాల్గొన్న చైర్ పర్సన్ ఉప్పల హారిక రాము దంపతులు క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 1 వ వార్డు దైవ కృప గా స్పెల్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులు పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో స్థానిక దైవజనులు చిల్లిముంత. లేమియేల్, చిల్లిముంత. ఎజ్రా, వైసిపి సీనియర్ నాయకుడు కౌన్సిలర్ కటకం ప్రసాద్,1 వ వార్డు కౌన్సిలర్ బళ్ల. పద్మావతి,19 వ వార్డు కౌన్సిలర్ జై యేసు,21 వ వార్డు కౌన్సిలర్ పిచ్చుక సతీష్ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా1500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెనుగంచిప్రోలు : దైవకుమారుడుయేసు క్రీస్తు.. మానవుడిగా జన్మించిన రోజును, ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని. పెనుగంచిప్రోలు లోని డౌన్ సెంటర్ జెజియం మందిరం పాస్టర్ ఎం జోసఫ్ పాల్ పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జెజియం మందిరం లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ ఎం జోసఫ్ పాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ నే అని.ఏసు ప్రభువు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గ నిర్దేశం చేశారన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు జొన్నలగడ్డ. నాగరాజు. నిమ్మతోట. పద్మ సహకారం తో వృద్ధులకు చీరలు పంపిణీ. అలాగే సంఘం లో వున్న 300మందికి హెడ్ కానిస్టేబుల్ కనపర్తి. వేడుకొండలు సహకరంతోస్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గేరా. పాండవులు. జొన్నలగడ్డ. చిన్న గోపాల రావు. కిశోర్ మాస్టర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: సోమవారం క్రిస్మస్ సందర్భంగా మండలం లోని ప్రతి గ్రామంలో చర్చి లలో దైవజనులు శాంతి సామరశ్యంగా ప్రజలంతా ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఉదయం నుండి నూతన వస్త్రాలు ధరించి పిల్లలతో ముస్తాబైన చర్చిలలో ప్రార్థనలు చేసి మిఠాయిలు పంచారు.

వెనిగండ్ల రాము ప్రతేక ప్రార్థనలు, పండ్లు పంపిణి

విశాలాంధ్ర-గుడివాడ : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఏలూరురోడ్డులోని ఆర్‌సియం చర్చిలో అర్ధరాత్రి జరిగిన ప్రార్థన కార్యక్రమంలో తన తల్లి శాంతికుమారి, సోదరుడు రామకృష్ణ, కుటుంబ సభ్యులతో పాల్గొని సుమర్ 2గం॥ల పాటు పాల్గొన్నారు. బాలయేసుకు ప్రతేకంగా తయరు చేసిన పుష్పలు కానుకగా సమర్పించారు. భక్తులకు 2వేల 500 మందికి పండ్లు పంపిణీ చేశారు.

అనేక చర్చిలలో...

పట్టణంలోని వాడవాడలా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని సిఎస్ఐ చర్చిలో, సత్యనారాయణపురంలో ఫుల్‌గాస్పెల్ చర్చి నందు అప్పికట్ల జాషువ, పెద్దకాల్వసెంటర్‌లోని గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్‌లో పాస్టర్ సజ్జా బర్నబాస్, నాగవరప్పాడులోని రివైవల్ పెంతుకొస్తు మినిస్ట్రీస్, చౌదరిపేటలోని షారోను ప్రార్థనా మందిరం మందపాడులో ఫిలదెల్ఫియ ప్రార్థన మందిరంలో, సీయోను గాస్పెల్ ఫెలోషిప్ చర్చి, పెదఎరుకపాడులోని న్యూలైఫ్ ప్రార్థనా మందిరము, బాపూజీనగర్‌లో సెయింట్ దేవదాసు చర్చి, కార్మికనగర్‌లో బైబుల్ మిషన్ సీయోను ప్రార్థనమందిరం, నాగవరప్పాడులోని క్రీస్తు ప్రేమ సువార్త మందిరం, మందపాడు కొత్తకాలనీలో బేతెస్థ ప్రార్థనా మందిరం, పంచవటీ కాలనీలో నూతన యేరూషలేము ప్రార్థనా మందిరము, పెదఎరుకపాడు ఇమ్మానియేలు చర్చిలో సందేశాన్ని విశ్వాసులు అందించారు.

అంగన్వాడీ దీక్షలకు టీడీపీ మద్దతు

విశాలాంధ్ర -పెదపారుపూడి : అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్స్ సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరసన సమ్మెలో భాగంగా సోమవారం 14వ రోజు రిలే నిరాహార దీక్షను తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు వీరంకి గురుమూర్తి దీక్ష శిబిరంను దర్శించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అంగనవాడి సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుందని ఆయన దీక్ష చేస్తున్న సిబ్బందికి హామీ ఇచ్చారు. అనంతరం అంగనవాడి కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహార దీక్షను విరమింప చేసినట్లు అంగనవాడి కార్యకర్తల యూనియన్ పెదపారుపూడి మండల శాఖ అధ్యక్షురాలు ఎస్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ అధ్యక్షురాలు ఉమారాణి, ప్రాజెక్ట్ నాయకురాలు రత్నశ్రీ, కే వాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యవసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం మల్కాపట్నంలో జీసస్ విగ్రహం వద్ద సోమవారం వార్డు మాజీ కౌన్సిలర్స్ మేడికొండూరు మధుకర్ స్టెల్లా దంపతులు ఆ వార్డు శానిటరీ కార్మికులకు క్రిస్మస్ సందర్భంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తొలుత ఈ కార్యక్రమంలో దైవజనులు పెదపూడి ఇమ్మానియేల్ ఆనంద్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. గంద్రపు శీనయ్య మాస్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేకు కోసి సందేశాన్ని అందించారు అనంతరం మాజీ కౌన్సిలర్ మేడికొండూరి మధుకర్ స్టెల్లా దంపతుల సౌజన్యంతో అ వార్డులో పనిచేసే శానిటరీ కార్మికులకు నిత్యవసర సరుకులుమరియు నూతన వస్త్రాలు పంపిణీ చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో కొడాలి అజయ్ కుమార్, బొకినెల విజయ్ కుమార్, చుక్కా జయంత్, చుక్కా రవి, గుమ్మడి విద్యాసాగర్. ముప్పిడి కోటేశ్వరరావు, బొడ్డు నాగరాజు,బొర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎం సురేష్‌కు సత్కారం

విశాలాంధ్ర -చల్లపల్లి : సమాజంలో పేదలకు అనునిత్యం అండగా నిలుస్తున్న ఐవీఎం సురేష్ ప్రశంసనీయులని టీడీపీ సీనియర్ నాయకులు, చల్లపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) అన్నారు. సోమవారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌కు క్రిస్టమస్ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. చల్లపల్లి వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, గ్రామ ప్రముఖులు టీవీకేవీ ప్రసాద్, బుల్లా కిషోర్, వేముల హరికృష్ణలు ఐవీఎం సురేష్ ను సత్కరించిన వారిలో ఉన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - గుడివాడ : క్రిస్మస్ అంటే పేదలను ఆదుకోవడం మనకు ఉన్నదంట్లో కొంత అయిన వేచ్చించి సాయం అందిచడమే నాకు తెలిసి క్రిస్మస్ అని సామాజీవేత్త డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. సోమవారం స్థానిక తట్టివర్రు రోడ్డులోని పంపుల చెరువు సమీపంలో నివాస ఉన్న పేదలకు ఆర్.కె దుప్పట్లు, స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద ప్రజల మధ్య క్రిస్మస్ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏసుక్రీస్తు మనకోరకు పశువుల పాకలో జన్మించి తగ్గింపును తెలియజేయడం జరిగిందన్నారు. అయన పుట్టుకు గుర్తుగా పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కె వారియర్స్ షేక్ మీరాషరీఫ్, అయ్యప్ప, దివిలి సురేష్, మట్టా జగదీష్, చరణ్‌తేజ్, శివా, గంటా అంజి, నాగసాయి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక గుడ్‌మెన్ పేటలోని బ్లెసింగ్‌హెూమ్ వద్ద ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకార్ అధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంపటి సైమన్, వెల్పుల నాగబాబు, ఎం.మరియ్యబాబు, అత్తటి సాల్మన్, జుజ్జవరపు ప్రశాంతి, వేశపోగు సుందరయ్య, తాళ్ళూరి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): క్రిస్మస్ పండుగ సందర్భంగా 49వ డివిజన్, ఫ్రైజార్ పేట, తెలుగు బాప్టిస్టు చర్చ్ నందు నిర్వహించిన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుకు ఫాదర్ నిక్సన్ ఆంధ్రూస్ ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో బూదాల శ్రీనివాస్, గౌడిపేరు సుధీర్, పునూరి సతీష్ రాజ్, జమ్మలమడుగు మార్క్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జయంతి

విశాలాంధ్ర -గంపలగూడెం : భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్ బిహారీ వాజపేయి 99 వ జయంతి సందర్భంగా గంపలగూడెం మండల బీజేపీ పార్టీ ఘన నివాళి అర్పించారు, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరిపాలన లో అనేక మార్పులు చేసి, దేశం లో రహదారులు ను అభివృద్ధి చేసి, శాంతి కోసం పాకిస్థాన్ తో చర్చలు జరిపిన శాంతి దూత, భారత మాత ముద్దు బిడ్డ అటల్ బిహారీ వాజపేయి అని గంపలగూడెం మండల పార్టీ ఉపాధ్యక్షుడు నేరళ్ళ. యుగంధర్ తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంకుశం రావు, కోడుమూరు .సూర్య ప్రకాష్ (బుజ్జి),మండల కార్యదర్శి చిట్టెల. హనుమంతరావు,కే .నాగ గోపాల కృష్ణ, డివి. రామారావు , పాపోల. నర్సింహా రావు, నేరళ్ళ. నరసింహారావు, అన్నవరపు .క్రాంతి కుమార్, తదితరులుపాల్గొన్నారు.

చీరల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తూర్పు నియోజకవర్గం15వ డివిజన్ రామలింగేశ్వర నగరలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పలు చర్చిల్లో ఆళ్ళ విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త ఆళ్ల రామారావు, కుమారుడు ఆళ్ళ శ్రీను, నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ళ చల్లారావు చేతుల మీదుగా సోమవారం పేదలకు రూ.5 వేల విలువ గల చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు, ప్రపంచ శాంతికి ప్రతీక ఏసు క్రీస్తు జననమని, క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరు ఆచారిస్తూ అయన చూపిన ప్రేమానురాగాల మార్గంలో నడవాలని సూచించారు. పేదలకు సాయం చేయడం నిజమైన క్రిస్మస్ అని పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదిన సందర్భంగా రామలింగేశ్వరనగర్‌లో పలు చర్చిలో పేద మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్నా ఆళ్ళ రామారావు కుటుంబానికి డిప్యూటీ మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు చర్చిల పాధర్‌లు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సమాజ సేవ సంతృప్తినిస్తుంది : వసంతకుమార్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సమాజ సేవ సంతృప్తినిస్తుందని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు వసంతకుమార్ అన్నారు. నగరంలోని మాతృదేవో భవ వృద్ధాశ్రమయంలో సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరాజు పేట గ్రామస్తులు రిటైర్ న్యాయస్థానం ఉద్యోగి పచ్చంబాకు గిరిథర్ వారి మతృమూర్తి రంగమ్మ జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భగా వసంతకుమార్ మాట్లాడుతూ సమాజ సేవ గుణాన్ని పెంచుకోవాలన్నారు. మనం ఎంత మంచి చేస్తే.. అన్ని మంచి పనులు పూర్తవుతాయన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు స్వయంగా భోజనాన్ని అందించారు. ఇలాంటి సమాజ సేవ ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, ఉపాధ్యక్షులు మండా రాము, కమిటీ సభ్యులు పఠాన్ మహమ్మద్ జాని, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి... ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలైయ్యాయి. ఈ ఘటన సోమవారం విజయవాడ మొగల్‌రాజ్‌పురంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన క్రాంతికుమార్(39) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. తన ద్విచక్రవాహంపై పీబీ సిద్ధార్థ స్కూల్ నుంచి మైనేని రోడ్డులో వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరోక ద్విచక్రవాహం ఢీకొనడంతో ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో క్రాంతి కుమార్ అక్కడిక్కడే మృతి చెందారు. సాంబశివరావు, అనిరుధ్, జగదీష్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్రాంతి కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్లేడ్‌తో దాడి...వ్యక్తికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన సోమవారం విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన మాజహీ లట్టీపేటలోని గోల్డ్‌మేకింగ్ పనులు చేస్తుంటాడు. రాణిగారితోటతో కూరగాయాలు కొనుగోలు చేసి వస్తున్న సమయంలో కరకట్ట పై గుర్తుతెలియని యువకుడు బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాధితుడికి తీవ్రగాయాలైయ్యాయి. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బ్లేడ్‌తో దాడి చేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నగరం ముస్తాబు..

తోరణాలతో కూడలి

రంగులువేస్తూ....

అమరవీరుల స్థూపం

ఫెక్సీలు కడుతూ..

భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవాలకు విజయవాడ నగరం ముస్తాబైయింది. సీపీఐ ఆవిర్భావించి పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి బ్రిటీష్ పాలకుల బానిస చెర నుంచి మాతృభూమి విముక్తికై సాగిన వీరోచిత స్వాతంత్ర్య పోరాటం సాగించింది. భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలతో కూడిన ఉన్నతమైన సంస్కృతి సంప్రదాయాలకు, లౌకికతత్వానికి జీవం పోసింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పేద ప్రజలు, అణగారిన వర్గాల పక్షాన పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ ఉమ్మడి కృష్ణా జిల్లా, విజయవాడ నగరం పోరాటాల పురిటిగడ్డగా తెలుగునాట పేరుగాంచింది. సాంస్కృతిక చైతన్యానికి, భూపోరాటాలకు వేదికగా నిలిచింది. నిస్వార్థ ప్రజాసేవకుల నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ వెళ్లూనుకుంది. పార్టీ, నాయకుల పట్ల ప్రజల్లో గౌరవప్రదమైన ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పుడు 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంనేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సహాంతో ఉన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లను ఎర్రజెండాలతో, తోరణాలు, బ్యానర్‌లు, హోర్డింగులతో అలంకరించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు, తమ్మిన పోతరాజు, సితార సెంటర్ సర్కిల్స్‌తో పాటు ప్రధాన ప్రాంతాలైన కృష్ణలంక, మొగల్రాజపురం, సింగ్‌నగర్, వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్, బస్టాండ్ తదితర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. డివిజన్‌లలో పార్టీ కార్యాలయాలు, అనుబంధ సంఘాల కార్యాలయాలకు రంగులు వేసి సరికొత్తగా ముస్తాబు చేశారు. -విశాలాంధ్ర-విజయవాడ

నేడు ప్రదర్శన, బహిరంగ సభ

భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో పార్టీ శ్రేణులు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన తమ్మిన పోతరాజు రోడ్డులో పాతబస్తీ కలరా హాస్పటల్ నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై చిట్టినగర్‌సెంటర్, వాగు సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్ మీదుగా కోమలావిలాస్ సెంటర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం 5 గంటలకు బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొని సందేశం ఇస్తారని తెలిపారు. సభలో జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల సంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు మాజీ ఎమ్మెల్యే నాసర్‌వలి విగ్రహావిష్కరణ

నిస్వార్థ ప్రజాసేవకుడు, సీపీఐ నాయకులు, మాజీ శాసన సభ్యులు షేక్ నాసర్‌వలి విగ్రహాన్ని మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా ఆవిష్కరిస్తారని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కృష్ణలంక చలసానినగర్‌లోని సిద్దెం కృష్ణారెడ్డి భవన్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొంటారని వివరించారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-విజయవాడ : రోటరీ శ్రీదుర్గా, విజయవాడ సెంట్రల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక గుణదలలోని రోటరీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సెంటినీ సిటీ హాస్పటల్ ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ ఎస్వీ శివప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దగ్గు, జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన వివిధ వ్యాధుల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో విజయ సెంట్రల్ తరుపున ఎండీ ఇస్మాయిల్, ధర్మారావు, రెండు క్లబ్‌లకు సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు. కార్యదర్శి నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్లు

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : తమిళనాడు రాష్ట్రంలోని వి.ఐ.టి.వెల్లూర్ లో ఈ నెల 26 నుండి 30వ తేదీ వరకు జరుగనున్న 17వ జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ కు ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాల బాలికల జట్లు పయనమయ్యయని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లే శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ, చైర్మన్ నవీన్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అజీజ్, జట్ల సభ్యులకు క్రీడా దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలుర విభాగంలో ఎమ్.సుధానవ్ రవి నందన్ (నెల్లూరు), ఎమ్.రేవంత్, బి.ఎమ్.ఎస్.వి.కార్తీక్, యు.శ్రీష్, పి.వి.చిన్మస్ (ఎన్టీఆర్), వై.తెజిత్ (గుంటూరు), సి.హెచ్.ఎల్.వి.సందీప్ (కాకినాడ), ఎస్.యోజిత్ నాథ్ (కడప) బాలికల విభాగంలో ఏ.ఎస్.వైశాలి, ఏ.ఎస్.ఎమ్.వైష్ణవి (కృష్ణా), జి.మేధ శేషసాయి, ఏ. దివ్య జ్యోతి (కాకినాడ), ఎమ్.మోక్ష (కడప), యు.శ్రీశ్వి (ఎన్టీఆర్), టి.సంహిత (అనంతపురం), జె.వి.ఎమ్.మిత్రవిందా (గుంటూరు)లు ఎంపికయ్యారు.

వివాదానికి వేదికగా మారిన కాకాని వర్ధంతి

వాస్తవాలను మరుగున పరిచి
విగ్రహ పున ప్రతిష్ట : కాకాని విజయకుమార్

విశాలాంధ్ర-విజయవాడ : దివంగత కాకాని వెంకటరత్నం విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమంలో చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన కరమని నగర ప్రముఖులు, కాకాని అభిమానులు ముక్త కంఠంతో నినదించారు. సోమవారం విజయవాడ కాకాని సర్కిల్ (బెంజ్ సర్కిల్) వేదికగా జరిగిన కాకాని 51వ వర్ధంతి కార్యక్రమంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. కేవలం ప్రచార యావ, వ్యక్తిగత స్వార్ధంతో ఉక్కు మనిషి కాకానికి వారసునిగా ప్రకటించుకున్న వ్యక్తి చర్యలను ఈ సందర్భంగా తీవ్రంగా ఎండగట్టారు. ఈ సందర్భంగా కాకాని మనవడు విజయకుమార్ మాట్లాడుతూ దివంగత వెంకటరత్నం చరిత్రను, ఆయన విలువను దిగజార్చే విధంగా కొందరు వ్యక్తులు వ్యక్తిగత స్వార్ధంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిజానికి విగ్రహ పున ప్రతిష్ట ఘనంగా నిర్వహించేందుకు కాకాని అనుచరులు, సహచరులు అన్ని ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో, ఎటువంటి సంబంధం లేని కాకాణి తరుణ్ అనే వ్యక్తి కేవలం ప్రచార ప్రయోజనం కోసం వ్యవస్థను పూర్తిగా తప్పుదారి పట్టించారన్నారు. కాకాని అనుచరుడు పాలడుగు మాధవ కిషోర్ మాట్లాడుతూ విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమం ఆయన విలువను దిగజార్చిందన్నారు. శిలాఫలకం రాళ్లపై కాకాని చరిత్రను సైతం వక్రీకరించారని తెలిపారు. విజయవాడ తూర్పు మాజీ శాసనసభ్యులు యలమంచిలి రవి, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ కాకాని విగ్రహ పున ప్రతిష్టతో విజయవాడ చరిత్రను మసకబార్చే కుట్ర జరిగిందని అన్నారు.

యలమంచిలి రవి యూత్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

ఉక్కు కాకానిగా వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా యలమంచిలి రవి యూత్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేసారు. కార్యక్రమంలో యలమంచిలి రాజీవ్, సుంకర రవి, రవి యూత్ సభ్యులు మోహన్, రేఖాబాబు, పల్లా సాగర్, ఆటో రవి, ధనుంజయ, వల్లభనేని సాయి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబాపురంలో అలజడి

- సర్పంచ్‌పై వైసీపీ నేతల దాడి
- పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ అంబాపురంలో అలజడి రేగింది. గ్రామ సర్పంచ్ గంటికోట సీతయ్య పై వైసీపీ నేతలు, వల్లభనేని వంశీ ప్రధాన అనచరులు దాడులకు తెగబడ్డారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం అంబాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బెంజ్‌మెన్ గ్రామంలో రౌడీ రాజ్యం అనే పేరుతో నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శనకు పోలీసుల అనుమతి లేదు. గ్రామ సర్పంచ్ తమ ప్రదర్శనకు అడ్డుపడుతున్నాడని భావించి బాదులతో దాడి చేశారు. గ్రామస్తులు వెంటనే స్పందించి అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో కలకలకం రేపింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకటన

మా క్లయింట్ అయిన **శ్రీ పాలడుగు వేంకటేశ్వరరావు, తండ్రి చంద్రశేఖర్‌రావు,** నివాసము : డోర్ నెం. 29-28-69/ఎ, 1డి, శ్రీ చక్ర అపార్ట్‌మెంట్స్, గోవిందరాజుల నాయుడు వీధి, సూర్యారావు పేట, విజయవాడ-520 002, ఎన్.టి.ఆర్.జిల్లా గారి సంజాయిషీ పొంది తెలియజేయునది,

మా క్లయింట్ ది. **19-06-2006**వ తేదీన గుండు శంకరరావు, తండ్రి రామారావు గారి వద్దనుండి కొనుగోలు చేసి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. **3706/2006**గా రిజిష్టర్ చేసుకొని, అనుభవిస్తుయున్న ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు అనగా Registered Sale Deed No.3706/2006, dt: 19-06-2006, దస్తావేజును జిరాక్స్ తీయించుకొనుటకు **23-12-2023వ తేదీన** ఉదయం **10.00**గం.లకు, మా క్లయింట్ ఇంటినుండి దాబాకోట్ల సెంటర్, సింగ్‌నగర్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా దగ్గరకు వెళ్ళి చూసుకొనగా పైన తెలిపిన దస్తావేజు కనబడలేదు. చుట్టుప్రక్కల ఎంత వెతికినను కనిపించలేదు. కావున సదరు దస్తావేజు నెం.**3706/2006** ఎవరికైనా దొరికినయెడల పైన తెలుపబడిన అడ్రస్సునకు లేదా సదరు లాయర్ గారికి అందజేయగలరు. అట్లు కాకుండా వాటిని ఎవరైనను వినియోగించి మరియు చట్ట వ్యతిరేక చర్యలు చేసినయెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఇందుమూలంగా పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుటమైనది.

మండపాటి బసవరెడ్డి,
న్యాయవాది, డోర్ నెం. 29-28-1/2,
కోవెలమూడి వారి స్ట్రీట్, సూర్యారావుపేట,
విజయవాడ - 520002.
సెల్ : 9440152434.